
సాక్షి ప్రకాశం

సోమవారం, 27, మే, 2024



విజ్ఞాన వనం

వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచుతూ స్వాగతం పలుకుతోంది ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో ఉంది. - 8లో..



ప్రాణం తీసిన ఈతసరదా

రామతీర్థం జలాశయంలో సరదాగా ఈతకొట్టేందుకు వెళ్లిన తాళ్లూరు మండలం రామభద్రాపురానికి చెందిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
39.5/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీటీడీ ఆధ్వర్యంలో భజన మండళ్లకు శిక్షణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాస సాహిత్య ప్రాజెక్ట్ సభ్యులు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఒంగోలు సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో భజన మండళ్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆమేరకు ఆదివారం మధ్యాహ్నం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. శిక్షణలో ముఖ్య అతిథులుగా దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు ప్రసంగిస్తారని, టీటీడీ నుంచి వచ్చిన ప్రముఖ సంగీత వాగ్గేయకారులచే భజన మండలి కళాకారులకు కొత్త సంకీర్తనలతో శిక్షణ ఇస్తారని దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. శిక్షణలో భజన కళాకారులంతా పాల్గొనాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ పాల్గొన్నారు.

పర్యాటకులతో సందడిగా పాకల బీచ్



తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

సింగరాయకొండ: పాకలబీచ్ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. ఒక పక్క వేసవి సెలవులు, మరొక పక్క ఆదివారం కావటంతో పాటు ఎన్నికల హడావుడి తగ్గటం వంటి కారణాలతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. బీచ్‌కు మండలంతో పాటు ఇతర మండలాల ప్రజలు భారీగా కార్లు, ఆటోలు, ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి సముద్ర స్నానం చేసి తీరంలో సేదతీరారు. పర్యాటకులకు అవసరమైన తినుబండారాలు, ఐస్ క్రీమ్స్ తీరంలో అందుబాటులో ఉంచారు. తీరంలో మరిన్ని వసతులు కల్పించాలని పర్యాటకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అల..వల..దూరం..

ఆటపాటలతో హైలెస్సా..

- మత్స్య సంపద పరిరక్షణ కోసం విరామం
- 61 రోజుల పాటు గంగపుత్రులు తీరానికే పరిమితం
- ఉపాధి, ఆక్వా, వ్యవసాయ పనులకు
- తీరంలో వలలు, పడవలు, బోట్లు భద్రం
- కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సేదతీరుతూ..



పాకల సముద్రతీరం





తీరం ఇలా..	3 అసెంబ్లీలు	52 కిలో మీటర్లు
	5 మండలాలు	10,000 కుటుంబాలు
	సంప్రదాయ, ఇంజిన్ పడవలు: 1,243	

అపార జలనిధిలో ఎగిసిపడే కెరటాలపై సాగే బతుకు సమరం. కడలి ఒడిలో చేపల వేటే జీవనాధారం. గంగపుత్రులది నిరంతర జీవన పోరాటం. సంద్రంలో మగవాళ్లు.. తీరంలో మగువలు కష్టపడితేనే సజావుగా సాగే జీవన సమరం. వేట ఆగిన వేళ వారి జీవన ప్రయాణం విభిన్నంగా ఉంటుంది. ప్రకృతి విపత్తులు, ప్రభుత్వం విధించే వేట నిషేధం కాలంలో అలకు.. వలకు దూరంగా వీరు కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆ రెండు నెలలు మగవాళ్లు రొయ్యల పట్టుబడి పనులకెళ్తే.. మహిళలు ఇతర పనులకు వెళ్తున్నారు. మరికొంత మంది వలలు మరమ్మతులు చేసుకుంటూ..బోట్లు..పడవలు భద్రంగా కాపాడుకుంటుంటారు. ఇక తీరిక సమయాల్లో తీరంలో కబడ్డీ, వాలీబాల్ ఆటపాటలతో హైలెస్సా అంటూ సందడి చేస్తున్నారు.

సింగరాయకొండ:

నిరంతరం అలలతో సహవాసం చేసే కడలి పుత్రుల జీవనం వేట నిషేధకాలంలో విభిన్నంగా ఉంటుంది. తెల్లవారుజామునే గంగమ్మకు పూజలు చేసి నడిసంద్రంలోకి అడుగుపెట్టి మత్స్య సంపద కోసం సుదూర ప్రాంతాలకు వెళతారు. తిరిగి వచ్చే సరికి కొన్ని సందర్భాల్లో గంటలు.. రోజులు.. వారాలు పడుతుంది. ఇలా సాగరయానం చేసి అలసి సొలసిన వీరికి ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకూ విరామ సమయం. మత్స్య సంపద పరిరక్షణ కోసం ప్రభుత్వం రెండు నెలల పాటు ఈ నిషేధాన్ని అమలులోకి తెచ్చింది. బోట్లను తీరానికే పరిమితం చేసి చిన్న..చిన్న పడవల్లో సంప్రదాయ వేటకు అధికారులు అనుమతిస్తున్నారు. అది కూడా పరిమిత దూరంలో మాత్రమే వేటసాగించాల్సి ఉంటుంది.

విరామం ఎందుకంటే..

"సముద్రంలో విలువైన జీవరాశుల సంపద కనుమరుగవుతూ వస్తోంది. ప్రధానంగా వేసవిలో గుడ్లుపెట్టే సమయంలో వేట కారణంగా పునరుత్పత్తి పడిపోతూ వచ్చింది. దీంతో అరుదైన జాతుల మనుగడకు ముప్పు ఏర్పడింది. దీంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకూ గుడ్లుపెట్టే సమయంలో ప్రభుత్వం వేట నిషేధాన్ని అమల్లోకి తెచ్చింది. ఫలితంగా మత్స్య సంపద వృద్ధికి ఆటంకాలు తొలగిపోయాయి.



పాకల తీరంలో వలలు బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

విభిన్న జీవనం

నిరంతరం కడలిలో జీవనపోరాటం చేసే మత్స్యకారులు వేట నిషేధకాలంలో మాత్రం కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేస్తూ జీవనం సాగిస్తారు. అలాగే ఆదాయం కోసం ఇతర పనులకు సైతం వెళుతున్నారు. ఇతర వ్యాపకాలతో జీవనం సాగించడం ఆసక్తిని రేకెత్తిస్తుంది. వేట నిషేధకాలంలో మత్స్యకారులు తీరంలో తమ వలలు, పడవలు భద్రం చేసుకుంటారు. రెండు నెలలపాటు వీటిని భద్రంగా కాపాడుకుంటారు. అలాగే తీరానికి చేర్చిన బోట్లను, ఇంజన్లను మరమ్మతులు చేసుకుని నిషేధకాలం ముగిసిన తరువాత వేటకు సిద్ధం చేస్తారు. మరి కొందరు పెయింటింగ్, బేల్దారి పని, కరువు పని వంటి పనులకు వెళ్తుంటారు. అలాగే మండలంలోని ఆక్వా చెరువులకు, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లలో పనులకు వెళుతున్నారు. అలాగే కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూ స్నేహితులతో బీచ్ కబడ్డీ, వాలీబాల్, బీచ్ వాలీబాల్ వంటి ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.



పాకల తీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు

విరామ భృతి రూ.10 వేలు



ఏటా వేట విరామ సమయంలో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు పరిహారంగా ఇస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం మొక్కుబడిగా రూ.4 వేలు పరిహారంగా ఇచ్చేది. రకరకాల ఆంక్షలతో సగం మందికి కూడా అందేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. కడలిపుత్రులకు అండగా నిలిచారు. వారి జీవనోపాధికి ఎలాంటి ఆటంకం లేకుండా చేశారు.

తీరం ఇలా..

జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5 మండలాల్లో తీర ప్రాంతం విస్తరించి ఉంది. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు, ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలు, కొత్తపట్నం, కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో సముద్రతీరం ఉంది. వేటకు వెళ్లే మత్స్యకారులు 5,459 మంది ఉన్నారు.

ఆటో నడుపుకుంటూ..



ప్రతి రోజు తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లి 9 గంటలకల్లా తిరిగి వస్తాను. తరువాత గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తాను. ప్రస్తుతం వేట నిషేధ కాలంలో చేపల వేట లేకపోవటంతో ఉదయాన్నే ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ఆటో నడుపుకుంటే రోజుకు ఖర్చులు పోను రూ.400 మిగులుతుంది.

– కుర్రు కళ్యాణ్, చెల్లెమ్మగారి పట్టపుపాలెం, పాకల

ఉపాధి పనులకు..



ప్రతిరోజు తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లి మధ్యాహ్నం లోపు తిరిగి వస్తాను. ప్రస్తుతం వేట నిషేధ కాలంలో చేపల వేట లేకపోవటంతో ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్నాను. ప్రతిరోజు సుమారు రూ.200 లభిస్తుంది. ప్రభుత్వం వేట నిషేధ భత్యం రూ.10 వేలు అందించి ఆదుకుంటోంది.

– కొండూరి అంకయ్య, క్రాంతినగర్, పాకల

సీబీఎస్ఈకి సన్నద్ధం

- ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ పాఠాలు
- తొలివిడతగా 63 పాఠశాలలు ఎంపిక
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం



సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంపికైన పుల్లలచెరువు కేజీబీవీ పాఠశాల

పుల్లలచెరువు: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత సొంతమవుతుందని, వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో సంస్కరణలు చేపట్టింది. నాడు-నేడు కింద పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన అమలు చేయనున్నారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇందు కోసం జిల్లాలో 63 పాఠశాలలను తొలివిడతగా ఎంపిక చేశారు. బడుల్లో బట్టీ విధానానికి, మూసపద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్‌ను అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ముండ్లపాడులో గణితం, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వడం పూర్తిచేశారు.


పేద విద్యార్థులకు ప్రోత్సాహం:

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ సిలబస్ విధానం అమలవుతోంది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి, పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో దీన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ బోధన ద్వారా చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రం పరిధిలోకి వెళ్తుంది. జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం. విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. విద్యార్థుల ఆసక్తి, అభిరుచిని గుర్తించి వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు సబ్జెక్టు టీచర్లను నియమిస్తారు.

సీబీఎస్ఈ సిలబస్ ప్రయోజనాలు ఇవీ..

- విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. కోర్సు నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు. పుస్తకాలు ఆసక్తిగా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూపొందిస్తారు.
- పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు దోహదపడతాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటాయి. వాస్తవాలకు దగ్గరగా విద్యను బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతానికి పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. ఏ మేరకు సబ్జెక్టు నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు. ఫలితాలు అనుకూలంగా వస్తాయి.
- ఐఐటీ, ఎయిమ్స్ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు కొనసాగించాలనుకుంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు చాలా సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య విద్యాలయాల్లో సీబీఎస్ఈ బోధన అమలుకు బోర్డు నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు తెచ్చింది.

ప్రభుత్వ నిర్ణయం స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధనను అందుబాటులోకి తేవడం స్వాగతించదగ్గ అంశం. ప్రభుత్వ నిర్ణయం భేష్. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు రాణించేందుకు అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు కృషి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కె.చిన్నా, విద్యార్థి తండ్రి, పుల్లలచెరువు

బాలినేనిని కలిసిన నాయకులు



హైదరాబాద్ లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఒంగోలు టౌన్: పోలింగ్ తరువాత హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కలిశారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ షేక్ మహబూబ్, వడ్డెర కార్పొరేషన్ డైరక్టర్ శ్రీనివాసరాజు, 48వ డివిజన్ నాయకులు పసుపులేటి వీరా, పార్టీ నాయకులు షేక్ జానీ, దేవరపల్లి అంజిరెడ్డి తదితరులు బాలినేనిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో బాలినేని పోలింగ్ సరళిని గురించి విశ్లేషించారు. జూన్ 4వ తేదీ తరువాత రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రెండోసారి కూడా అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఒంగోలులో తన గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతతోపాటుగా నలువైపులా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని రైస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూం వద్ద ఉన్న రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా పహారా కాయాలన్నారు.

కౌంటింగ్‌కు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ...

జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. కౌంటింగ్ వచ్చే వివిధ పార్టీల ఏజంట్లతో వాహనాల రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందుకు వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలకు తరలించాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని, కాషనరీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ఏజంట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే కౌంటింగ్ కేంద్రం లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరినీ తనిఖీలు చేయాలని, వారికి కేటాయించిన గుర్తింపు కార్డులు పరిశీలించాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోనికి అభ్యర్థులు, అధికారులు, ఏజెంట్లు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోలు రూం, మీడియా పాయింట్, మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ కిశోర్ కుమార్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సింగరాయకొండ సీఐ రంగనాథ్, ఇతర శాఖల అధికారుల ఎస్పీ వెంట ఉన్నారు.



రైస్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

గురుకుల ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

బేస్తవారిపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని అర్ధవీడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ బీ బలరామిరెడ్డి తెలిపారు. 5వ తరగతిలో బాలుర అడ్మిషన్ కోసం ఈనెల 28న, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఈనెల 30న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో, ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయనివారు కూడా కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని చెప్పారు.

వెలుగొండ గురుకులంలో..

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిపోయిన సీట్లకు కేవలం ఎస్సీ విద్యార్థులకు మాత్రమే నేరుగా ప్రవేశం కల్పించేందుకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ఈ నెల 28వ తేదీ దర్శిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తారని చెప్పారు.

- విద్యార్థులను ఆకట్టుకుంటున్న ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్
- మరో జురాసిక్ పార్క్‌ను మరిపించే నాలెడ్జ్ పార్క్
- జంతు జీవజాల పరిణామక్రమాలు తెలిపే చక్కటి వేదిక
- ఆకట్టుకుంటున్న డైనోసార్లు, ఆదిమానవుల విశేషాకృతులు

ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్ ముఖద్వారం

వేటాడేందుకు సిద్ధంగా ఉన్న పెద్దపులి

అద్భుతమైన ఆకృతితో ఆకర్షించే డైనోసార్‌లు





ఆహారం కోసం ఆదిమానవుల జంతువు వేట

విజ్ఞాన వనం

పెద్దదోర్నాల: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతూ స్వాగతం పలుకుతోంది ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్. విశ్వం ఆవిర్భావంతో పాటు మానవ పరిణామ క్రమం, జీవజాలం సృష్టి, జంతువుల జననం, మరణం వరకు జీవిత విశేషాలన్నీ ఈ పార్క్‌లో వీక్షించవచ్చు. ఆకట్టుకునే ఆకృతులు ఆశ్చరపరిచే వివరాలతో ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్కు విజ్ఞాన వనంలా ఆకట్టుకుంటుంది. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లేమార్గంలో సుండిపెంటలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ఉన్న ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాలకు చెందిన ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ కార్యాలయానికి అత్యంత సమీపంలో రోడ్డు పక్కనే ఇది కనిపిస్తూ ఉంటుంది. శ్రీశైలానికి కూడా ఇది 5 కి.మీ దూరంలో ఉంటుంది. అక్కడ బయోడైవర్సిటీ ప్రాంగణానికి ఎదురుగా ఉన్న అద్భుతమైన వనప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ పార్కు సందర్శకులను ఎంతో ఆకర్షిస్తుంది. విజ్ఞాన విహార యాత్రలకు శ్రీశైలానికి వచ్చే విద్యార్థులు మార్గమధ్యంలో ఉన్న బయోడైవర్సిటీ కేంద్రంతో పాటు ఈ పార్కును కూడా తప్పనిసరిగా సందర్శిస్తుంటారు. ఈ పార్కును 2012 సెప్టెంబర్ 23న ప్రారంభించారు. ఒక్కసారి ఈ పార్కులోకి అడుగు పెడితే విద్యార్థులు బాహ్యప్రపంచాన్ని మరిచిపోయి పురాతన కాలం నాటి పరిస్థితుల నుంచి నేటి నవ నాగరికత దిశగా ఏర్పడిన పరిణామాలన్నింటినీ చూసి ఆశ్చర్యంతో పాటు ఆనందానికి లోనవుతారు. ముఖ్యంగా పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆదిమానవుల జీవిత విశేషాలు, నాడు వారు ఆహారం కోసం జంతువులను వేటాడే విధానం, జంతు జీవపరిణామ క్రమం, డైనోసార్ల పుట్టుక, జురాసిక్ పార్క్‌ను తలదన్నేలా డైనోసార్ల భారీ ఆకృతులు, గిరిజనుల జీవనశైలి, పక్షులు, వన్యప్రాణుల ఆకర్షణీయ శిలాకృతులు సందర్శకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి.



డైనోసార్ల పునరుత్పత్తి దృశ్యం



చెట్టుపై చింపాజీ కేరింతలు

అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణులు





భారీ ఆకృతితో ఆకర్షిస్తున్న డిప్లోడోకస్



గ్రామీణుల జీవన స్థితిగతులను సూచించే చిత్రం

క్లుప్తంగా

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన సీతారాంపురం హైస్కూల్ బాలికలు

హనుమంతునిపాడు: జాతీయస్థాయిలో జరిగే త్రోబాల్ పోటీలకు మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల బాలికలు ఎంపికైనట్లు పాఠశాల పీడీ షేక్ జిలానీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న జాతీయస్థాయి త్రోబాల్ ఎంపికల పోటీలు విజయవాడలో జరిగాయి. ఈ ఎంపిక పోటీలో సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు డి.వరుణ్, రామ్‌చరణ్, బాలికలు ఏ.గాయత్రి, జె.లక్ష్మీదేవి, జె.లాస్యప్రియ, ఏ.రేఖలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలో జరిగే జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు. సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు మారంరెడ్డి రవేంద్రరెడ్డి విద్యార్థుల ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి


కొమరోలు: మండలంలోని బాదినేనిపల్లెలో గుర్రప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. గుర్రప్ప స్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై లారీ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. మండలంలోని దూపాడు సమీపంలో శనివారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పెద్దారవీడు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన జయపాల్ తీవ్రంగా గాయపడగా మార్కాపురం వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎస్సై సాంబశివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఈతకు వెళ్లి యువకుడు మృతి
- జాతర రోజు రామభద్రాపురంలో విషాదం
- మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలింపు



యాతం మణికంఠరెడ్డి (ఫైల్)

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని రామభద్రాపురం గ్రామానికి చెందిన యాతం మణికంఠరెడ్డి (18) ఈతకు వెళ్లి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..ఆదివారం గ్రామస్తులు పోలేరమ్మ జాతర సందర్భంగా పొంగళ్లు పొంగించి ఉత్సాహంగా జాతర జరుపుకుంటున్నారు. ఇదే సమయంలో పది మంది యువకులు సరదాగా ఈత కొట్టేందుకు చీమకుర్తి మండల పరిధిలోని రామతీర్థ జలాశయం వద్దకు వెళ్లారు. అక్కడ ఈత వచ్చిన నలుగురు యువకులు ఈత కొట్టేందుకు జలాశయంలోకి దిగారు. అయితే సరిగా ఈత రాని మణికంఠరెడ్డి కూడా వారితో పాటు స్నేహితుడి సహాయంతో నీళ్లలోకి దిగాడు. కొంత లోతుకి వెళ్లిన తర్వాత మణికంఠను వెనక్కి వెళ్లమని చెప్పడంతో వెనుదిరిగాడు. అయితే ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయి ఊపిరాడక మృతి చెందాడు. ఎంత సేపటికి మణికంఠరెడ్డి మృతదేహం పైకి రాకపోవడంతో జరిగిన విషయాన్ని యువకులు గ్రామస్తులకు తెలియజేశారు. హుటాహుటిన జలాశయం వద్దకు చేరుకున్న గ్రామస్తులు మణికంఠరెడ్డి మృతదేహం కోసం గాలించారు. వారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో తీరప్రాంతంలో గజ ఈతగాళ్లకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టారు. గ్రామానికి చెందిన యాతం వెంకటేశ్వరరెడ్డి, అనసూర్యలకు కుమార్తె కావ్య, కుమారుడు మణికంఠరెడ్డి ఉన్నారు. కావ్యకు వివాహం కాగా మణికంఠరెడ్డి పదో తరగతి పూర్తి చేసి తూర్పుగంగవరంలో దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా గడపాలనుకున్న మణికంఠరెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



రామతీర్థం జలాశయం వద్ద గుమిగూడిన గ్రామస్తులు

టిప్పర్ ఢీకొని ఒకరు మృతి



టిప్పర్ కింద పడి ఉన్న మృతదేహం



వెంకట సుబ్బారావు మృతదేహం

చీమకుర్తి: గ్రానైట్ టిప్పర్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక సమీపంలో కర్నూల్‌రోడ్డుపై జరిగింది. ప్రమాదంలో మద్దిపాడు మండలం బసవన్నపాలెం గ్రామానికి చెందిన గొర్రె వెంకట సుబ్బారావు(64) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే..బసవన్నపాలెం నుంచి ఎండ్లూరు డొంక సమీపంలోని సత్సంగ కేంద్రంలో దేవుని సేవ నిమిత్తం వెంకట సుబ్బారావు వస్తున్నాడు. రోడ్డు డివైడర్ దాటుతున్న సమయంలో ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వస్తున్న గ్రానైట్ టిప్పర్ వెంకట సుబ్బారావు బైకును ఢీకొట్టడంతో టిప్పర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒంగోలు తాలూకా ఎస్సై విజయకుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- కత్తితో దాడిలో ముగ్గురికి గాయాలు

కురిచేడు: రెండు కుటుంబాల మధ్య ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని పెద్దవరం ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన యర్రగుంట్ల పెద్ద నాగేషు నిత్యం మద్యం మత్తులో దూషిస్తూ ఉంటాడు. దీంతో పక్కనే ఉన్న యర్రగుంట్ల ఏసు విషయాన్ని గ్రామ పెద్దలతో మాట్లాడి నాగేష్‌కు చెప్పి పంపించారు. అయినా శనివారం రాత్రి అతను మరోసారి దూషించడంతో ఏసు, అతని భార్య ప్రశ్నిస్తారు. దీంతో నాగేషు తన వద్ద ఉన్న కత్తితో దాడి చేశాడు. దాడిలో ఏసు, భార్య మరియమ్మ, మనవడు జయపాల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనాన్ని సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం వినుకొండ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఏసు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఏసు భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

కనులపండువగా రథోత్సవం



దూపాడు చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవం

త్రిపురాంతకం: మండలంలోని దూపాడులో ఉన్న గంగా భ్రమరాంబ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. పురాతన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఏటా వైశాఖ మాసంలో ఈ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం రథోత్సవం కనువపండువగా సాగింది. రథోత్సవాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అయితా కుటుంబీకులు, మాజీ సర్పంచ్ ఆళ్ల నాసరరెడ్డి తదితర గ్రామపెద్దలు ఉత్సవాలలో పాల్గొన్నారు.